సాక్షి సూర్యాపేట

సోమవారం । 27 । ఫిబ్రవరి । 2023



ధార్మిక సభలు ప్రారంభం

యాదాద్రీశుడి కొండపైన శివాలయం సమీపంలో ధార్మిక, సాహిత్య మహాసభలు ప్రారంభమయ్యాయి. - 8లో



చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.నవీన్‌రావు అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 36°/18°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువ.

న్యూస్‌రీల్

సూర్యక్షేత్రంలో మహా సౌరహోమం



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం మహాసౌరహోమాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మినీ ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు జరిపించిన అనంతరం యజ్ఞశాలలో మహాసౌర హోమం నిర్వహించారు. క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను భక్తులు దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి, గణపురం నరేష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని ఆదివారం అర్చకులు విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రత్యేకార్చనలు జరిపించారు. అనంతరం స్వామి అమ్మవార్లకు అష్టోత్తర సహస్ర నామార్చన, కుంకుమార్చనలు చేపట్టారు. అదేవిధంగా స్వామి అమ్మవార్లను అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ఛైర్మన్ చెన్నూరు విజయ్ కుమార్, ఈఓ నవీన్, అర్చకులు లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యం



మాట్లాడుతున్న బొబ్బా భాగ్యరెడ్డి

గరిడేపల్లి : తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఉచిత విద్య, వైద్యంపైనే తొలి సంతకం ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొబ్బా భాగ్యరెడ్డి అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామంలో నిర్వహించిన బీజేపీ శక్తి కేంద్రాల స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్లు, రైతులకు ఫసల్ బీమా యోజన పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం జరుగుతుందన్నారు. స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి కోసం రాష్ట్రానికి నిధులు ఇస్తుంటే బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం చిల్లిగవ్వ కూడా ఇవ్వడం లేదంటూ ప్రజల్లోకి తప్పుడు సమాచారాన్ని తీసుకెళ్తుందన్నారు. కేసీఆర్ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీజేపీ కార్యకర్తలు, శక్తి కేంద్రాల బాధ్యులు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాకల వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి పత్తిపాటి విజయ్, పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్ అంజయ్య, బూత్ కమిటీ అధ్యక్షుడు కోమరాజు లచ్చారి, మండవ వీరయ్య తదితరులున్నారు.

గోదావరి జలాల పెంపు



అర్వపల్లి : జిల్లాకు గోదావరి జలాలను ఆదివారం పెంచారు. ప్రస్తుతం 1200 క్యూసెక్కులు వస్తుండగా వీటిని 1800 క్యూసెక్కులకు పెంచారు. ఎస్సారెస్పీ నుంచి గోదావరి జలాలను పెంచడంతో జిల్లాకు నీటిని పెంచినట్లు నీటి పారుదలశాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ అమర్ తెలిపారు. ఈ నీటిలో 69 డీబీఎంకు 500 క్యూసెక్కులు, 70 డీబీఎంకు 200 క్యూసెక్కులు, 71 డీబీఎంకు 1100 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలను వదులుతున్నట్లు పేర్కొన్నారు.

● సింహ వాహనంపై యాదాద్రీశుడు



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సింహ వాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగుతున్న యాదాద్రీశుడు



ప్రధానాలయంలో దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

గడువులోపు గగనమే..

- సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి రూ.35.60కోట్లు మంజూరు
- మార్చి ఆఖరి నాటికి పనులు పూర్తి చేసేందుకు సిద్ధం చేసిన అధికారులు
- ముందుకురాని కాంట్రాక్టర్లు
- సమయానికి బిల్లులు రావనే భయమే కారణం



చిలుకూరులో వేస్తున్న సీసీరోడ్డు (ఫైల్)

చిలుకూరు: ఒకప్పుడు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు పోటీలు పడేవారు. పనుల కోసం పెద్దఎత్తున పైరవీలు చేసుకునేవారు. కానీ నేడు నిధులు వచ్చాయి.. పనులు చేయండని అధికారులు పదేపదే చెబుతున్నా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. రూ.5 లక్షల లోపు పనులు చేసే సర్పంచ్‌లు కూడా ముందుకు రావడం లేదు. ఇందుకు ప్రధాన కారణం చేసిన పనులకు సమయానికి బిల్లులు రాకపోవడమే కారణమని అంటున్నారు. ఇందుకు నిదర్శనమే ఇటీవల జిల్లాకు ఉపాధిహామీ నిధులు రూ.35 కోట్లు వచ్చినా నేటి వరకు పనులు ప్రారంభించకపోవడమే.

ఎక్కడా ప్రారంభం కాని పనులు

సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంలో మండల స్థాయిలో ఎంపీడీఓ, పీఆర్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు గ్రామ పంచాయతీ తీర్మానంతో ఈ పనులు చేయాల్సి వస్తుంది. జిల్లాలో ఈ తీర్మానాలు దాదాపుగా పూర్తయ్యాయి. కానీ ఈ ఏడాది ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో డబ్బులు వస్తాయో లేదో అని ఒక వైపు.. గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లింపులో జాప్యం నెలకొనడంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ దిశగా అధికారులు కార్యాచరణ చేస్తున్నారు. జిల్లాలో 23 మండలాల్లో 17 మండలాలకు నిధులు మంజురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా కనీసం ఎక్కడ కూడా పనులు ప్రారంభం కాలేదు. పనులకు ఒక నెల ఉండడంతో మార్చి అఖరికి పనులు పూర్తి కావడం గగనంగానే మారింది.

గత ఏడాది బిల్లులే రాలేదు



“గత ఏడాది చేసిన సీసీ రోడ్లు, డ్రెయినేజీల బిల్లులే నేటి వరకు రూ.13 లక్షలు రావాల్సి ఉంది. ఆ బిల్లులే నేటి వరకు రాలేదు. ప్రస్తుతం మా గ్రామానికి రూ.25 లక్షలు సీసీ రోడ్లు వచ్చాయి. ఈ పనులు చేసే పరిస్థితి లేదు. ఎవరిని అడిగినా పనులు చేసేందుకు ముందుకు రావడం లేదు. మా గ్రామం ఉపాధిహామీ నిధుల నుంచి నూతన గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షలు, ఆరోగ్య ఉప కేంద్రానికి మరో రూ.20 లక్షలు మంజురయ్యాయి. కానీ బిల్లు వచ్చే పరిస్థితి లేదు.

– నందలాల్, సర్పంచ్, దూదియాతండా

17 మండలాలకు..

గ్రామాల్లో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఉపాధిహామీ నిధుల నుంచి సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి జిల్లాలోని 17 మండలాలకు రూ.35.60కోట్లు మంజూరయ్యాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వీటిని కేటాయించారు. ప్రస్తుతం మార్చికి ఒక నెల మాత్రమే ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి ఆఖరి నాటి కల్లా ఈ రోడ్లు పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చేశారు. కానీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.

నియంత్రణలో ఫైలేరియా

- 7 నుంచి 10వ తేదీ వరకు సర్వే నిర్వహించిన అధికారులు
- 9 గ్రామాల్లో 4,500 మంది నుంచి రక్త నమూనాల సేకరణ
- ప్రాథమిక పరీక్షల్లో ఐదు పాజిటివ్ కేసులు నమోదు



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యులు

నాగారం : జిల్లాలో బోదకాలు వ్యాప్తి నియంత్రణలోనే ఉంది. కోడాడ డివిజన్‌లోని ఎంపిక చేసిన తొమ్మిది గ్రామాల్లో ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఫైలేరియా సర్వే నిర్వహించారు. గ్రామానికి 500 మంది చొప్పున మొత్తం 4,500 మంది రక్త నమూనాలను అధికారులు సేకరించారు. అనంతరం వీటిని ప్రాథమిక స్థాయిలో నిర్ధారణ పరీక్షలు చేయగా కేవలం 5 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. క్యూలెక్స్ దోమ కాటు వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. బాధితులను కుట్టిన దోమ మరొకరిని కుడితే ఈ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. దోమకాటు వల్ల ఫైలేరియా బారినపడ్డ వారికి ఆ ప్రభావం దాదాపు నాలుగు నుంచి ఐదేళ్లలో కనిపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలో దాదాపు ఆరేళ్ల కిందట 2016లో ఈ సర్వే చేశారు. ఆ తరువాత ఇటీవల మళ్లీ చేశారు. కాగా ఇప్పటికే జిల్లాలో 5400 మంది బోదకాలు వ్యాధితో బాధపడుతున్నారు. గతంలో పోల్చితే జిల్లాలో కేసుల తీవ్రత తగ్గిందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

ప్రాథమిక పరీక్షలు ఇలా..

అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను మైక్రోస్కోపు ద్వారా ఫైలేరియా సంబంధిత బ్యాక్టీరియాను గుర్తిస్తారు. ఇలా గుర్తించిన నమూనాలతో పాటు సేకరించిన మొత్తం నమూనాలు హైదరాబాద్‌లోని కేంద్ర మలేరియా ల్యాబ్‌కు తరలించి అక్కడ పూర్తి స్థాయిలో నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఈ పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ కచ్చితంగా ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు.

సర్వే వివరాలు ఇలా..

ఎంపిక చేసిన గ్రామాలు	నమోదైన కేసులు
09	05
ఇప్పటికే ఉన్న బాధితులు	5,400
సేకరించిన రక్త నమూనాలు	4,500

కేసుల తీవ్రత తగ్గింది



“ప్రస్తుతం సేకరించిన నమూనాలన్నింటిని కేంద్ర ల్యాబ్‌కు పంపించాం. స్థానికంగా చేసిన నిర్ధారణ పరీక్షల్లో 5 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. బాధితులను గుర్తించి వారికి మందులు పంపిణీ చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా సర్వే చేసి బాధితులను గుర్తిస్తాం. గతంతో పోల్చుకుంటే జిల్లాలో కేసుల తీవ్రత తగ్గింది.

– డాక్టర్ సాహితి, జిల్లా కీటకజనిత వ్యాధుల నియంత్రణ అధికారిణి, సూర్యాపేట


నేటి నుంచి నిర్విరామంగా సాగునీరు



శానంపూడి సైదిరెడ్డి, ఎమ్మెల్యే

పాలకవీడు: యాసంగి పంట చేతికొచ్చే వరకు జాన్‌పహాడ్ మేజర్ కాల్వకు సోమవారం నుంచి నిరంతరాయంగా నీటిని అందించనున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం వారబందీ పద్ధతిలో సాగునీరు అందుతుండగా ఆయకట్టు చివరి ప్రాంత రైతులు పడుతున్న ఇబ్బందులను రైతులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తన దృష్టికి తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈమేరకు సాగర్ నీటిపారుదల చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడినట్లు తెలిపారు. జాన్‌పహాడ్ మేజర్‌తోపాటు మక్తాల బ్రాంచ్ కాల్వలకు నిరంతరం నీటిని కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

ఆత్మకూరు (ఎస్) (సూర్యాపేట) : వెనుకబడిన రెడ్డి వర్గ ప్రజల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ.5వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జాగృతి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుట్టం గారి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు మండల పరిధిలోని నిమ్మికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెడ్డి ఆత్మీయ సభలో ఆయన మాట్లాడారు. రెడ్లలో కూడా నిరుపేద వర్గానికి చెందిన వారు ఉన్నారని, వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్న రెడ్డి కులస్తులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో నెట్టుకువస్తున్నారని తెలిపారు. రెడ్డి విద్యార్థుల కోసం గురుకులాలు, స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పాటు అన్ని రకాల అర్హత పరీక్షల్లోనూ కటాఫ్ మార్కులు, వయోపరిమితి సడలించాలన్నారు. 60 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ అన్నదాత పేరున నెలకు రూ.5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్ రెడ్డి, రెడ్డి జాగృతి వ్యవస్థాపక సభ్యుడు కొట్టం మధుసూదన్ రెడ్డి, పోరెడ్డి శాంతన్ రెడ్డి, సురకంటి నర్సిరెడ్డి, నాయకులు మద్ది సుధాకర్ రెడ్డి, ఎడవల్లి రంగారెడ్డి, గార్లపాటి లింగారెడ్డి, దేవరపల్లి జయశంకర్, రెడ్డి సురేందర్ రెడ్డి, నరసింహారెడ్డి, సైదిరెడ్డి, ప్రతాపరెడ్డి, వెంకట్రెడ్డి, ముత్తారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోదాడ మున్సిపల్ సమస్యలపై ‘సాక్షి ఫోన్‌ఇన్’

ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

కోదాడ మున్సిపాలిటీ పరిధిలో కుక్కలు, కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారా.. మంచినీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్య ఎదుర్కొంటున్నారా.. అయితే మీ సమస్యనే నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చు. మున్సిపల్ కమిషనర్‌తో సోమవారం ‘సాక్షి’ ఫోన్‌ఇన్ నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్‌ఇన్



మహేశ్వరరెడ్డి, మున్సిపల్ కమిషనర్, కోదాడ

ఫోన్ చేయాల్సిన నంబర్ : 83744 50356

పేట ఆర్టీసీ డ్రైవర్‌కు జాతీయ పురస్కారం

- హీరోస్ ఆన్ ది రోడ్ అవార్డు అందుకోనున్న సోమిరెడ్డి
- ఏప్రిల్ 18న అందజేయనున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



బస్సు నడుపుతున్న కల్లు సోమిరెడ్డి

భానుపురి, నకిరేకల్ : సూర్యాపేట ఆర్టీసీ డిపోకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 36 సంవత్సరాల 6 నెలల సర్వీస్ లో ఏ చిన్న ప్రమాదం లేకుండా ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చినందుకుగాను సూర్యాపేట డిపోనకు చెందిన కల్లు సోమిరెడ్డి హీరోస్ ఆఫ్ ది రోడ్ పురస్కారాల్లో భాగంగా జాతీయ స్థాయిలో ఉత్తమ డ్రైవర్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, ఎండీ సజ్జనార్ ఆదివారం అధికారికంగా ప్రకటించారు. దేశవ్యాప్తంగా రోడ్డు భద్రతా విభాగంలో ప్రమాద రహిత డ్రైవర్లను గుర్తించగా రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. అందులో సూర్యాపేట డిపోకు చెందిన సోమిరెడ్డి ఒకరు. సోమిరెడ్డి స్వస్థలం నకిరేకల్ మండలం కడపర్తి గ్రామం. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్ టేకింగ్స్ (ఏఎస్ఆర్టీయూ) ప్రకటించిన ఈ అవార్డును కేంద్ర రోడ్డురవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఏప్రిల్ 18న అందించనున్నారు.

1986 నుంచి ప్రమాదాలు లేకుండా..

సోమిరెడ్డి 1986లో ఆర్టీసీలో ఉద్యోగంలో చేరారు. మొదటగా తాండూరు ఆర్టీసీ డిపోలో పనిచేయగా 1987లో అప్పటి ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. ఆ తర్వాత 1989లో నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోనకు బదిలీపై వచ్చారు. దాదాపు 30 ఏళ్లకు పైగా అక్కడే తన సర్వీసు కొనసాగించారు. డ్రైవింగ్‌లో ఎలాంటి పొరపాట్లు చేయకుండా సంస్థకు మంచిపేరు తీసుకొచ్చారు. తాండూరు, నార్కట్‌పల్లితో పాటు సూర్యాపేటలోనూ డ్రైవర్‌గా పనిచేసినా ఎక్కడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా బస్సులు నడిపినందుకు పలుమార్లు జిల్లా స్థాయిలో, ఒకసారి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఆర్టీసీ డ్రైవర్‌గా అవార్డులు పొందారు.

మార్చి 30న ఉద్యోగ విరమణ

సోమిరెడ్డి నార్కట్‌పల్లి డిపో నుంచి ఆరునెలల క్రితం గతేడాది సెప్టెంబర్‌లో బదిలీపై సూర్యాపేట ఆర్టీసీ డిపోనకు వచ్చారు. అయితే ఈ ఏడాది మార్చి 30న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో రహదారి భద్రతా విభాగంలో ఉత్తమ డ్రైవర్‌గా అవార్డు రావడంపై పలువురు డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది



“నా 33 ఏళ్ల సర్వీస్‌లో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా డ్రైవర్ వృత్తికి న్యాయం చేశా. నా సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో ఉత్తమ డ్రైవర్‌గా ఎంపిక చేసినందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది. డ్రైవర్లు అందరూ విధి నిర్వహణలో ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ బస్సులను జాగ్రత్తగా నడపాలి.

– కల్లు సోమిరెడ్డి, ఆర్టీసీ డ్రైవర్

విద్యార్థులు తల్లిదండ్రుల కలలు నెరవేర్చాలి

- జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శంకర్



విద్యార్థినులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శంకర్

కోదాడఅర్బన్ : విద్యార్థినులు తమ తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చే విధంగా ప్రణాళికాబద్ధంగా చదువులో ముందుకుసాగాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి శంకర్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు చారుగండ్ల రాజశేఖర్ అన్నారు. ఆదివారం కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీనగర్‌లో బాలికల గిరిజన ఆశ్రమ వసతి గృహంలో పదో తరగతి పరీక్షలపై విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పదో తరగతి పరీక్షల్లో 11 పేపర్లకు బదులు 6 పేపర్లు మాత్రమే ఉన్నాయన్నారు. విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యం కోసం అలుపెరగకుండా శ్రమిస్తే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన విద్య, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నదని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన వివిధ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి వంగపల్లి పద్మ, రామకృష్ణ, ఉపాధ్యాయులు సుజాత, స్వరూప, రేణుక, స్వాతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

అంతటా ఇన్‌చార్జ్ ఎంఈఓలే..

- సీనియర్ హెచ్‌ఎంలకు అదనపు బాధ్యతలు
- రెండు నుంచి మూడు మండలాలకు ఒక్కరే..
- 105 హైస్కూళ్లలో హెచ్‌ఎంలూ ఇన్‌చార్జ్‌లే..
- ప్రభుత్వ పాఠశాలలపై కొరవడిన పర్యవేక్షణ



చివ్వెంల ప్రాథమిక పాఠశాల

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొస్తున్నా ఫలితం దక్కడం లేదు. ఆయా పథకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడానికి కిందిస్థాయి అధికారులు లేకపోవడంతో లక్ష్యం నీరుగారుతోంది. పాఠశాల విద్యలో కీలకమైన ఎంఈఓ (మండల విద్యాధికారులు) పోస్టులు ఆరేళ్లుగా భర్తీ చేయడం లేదు. ఇన్‌చార్జుల ఆధ్వర్యంలోనే పాఠశాలల పర్యవేక్షణ కొనసాగుతోంది. అది కూడా ఒక్కో ఎంఈఓ మూడు నాలుగు మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉండటంతో పర్యవేక్షణ కష్టతరంగా మారుతోంది. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉండటంతో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లు ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వీరు ఒకపక్క ఇన్‌చార్జ్ బాధ్యతలు, మరోపక్క పాఠ్యాంశాల బోధన సక్రమంగా చేయలేక పాఠశాల నిర్వహణను గాడిలో పెట్టలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా..

అన్ని మండలాల్లో మొత్తం 182 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో 77 పాఠశాలల్లో మాత్రమే హెచ్‌ఎంలు ఉన్నారు. మిగిలిన 105 పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీరి స్థానంలో సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు హెచ్‌ఎంల బాధ్యతలు అప్పగించారు. స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించే ఉపాధ్యాయులు రోజుకు కనీసం 4 నుంచి ఐదు తరగతుల చొప్పున వారానికి కనీసం 24 ప్రత్యక్ష తరగతులు బోధించాలనే నిబంధన ఉంది. అలాగే జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లను తొలగించిన ప్రభుత్వం ఆ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పంచాయతీ కార్మికులతో సమన్వయం చేసుకొని పని చేయించుకోవాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ విధులకుతోడు మధ్యాహ్న భోజనం నిర్వహణ, పర్యవేక్షణ, విద్యార్థుల రోజువారీ హాజరు ఉన్నతాధికారులకు నివేదికలు వంటి వాటితో తమపై పనిభారం పెరిగిందని హెచ్‌ఎంలు వాపోతున్నారు.

23 మండలాలకు 12 మంది మాత్రమే..

జిల్లాలోని 23 మండలాలు ఉండగా అన్ని మండలాలకు ఇన్‌చార్జ్ ఎంఈఓలే ఉన్నారు. అయితే జిల్లాలో సీనియర్ హెచ్‌ఎంలకు ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు అప్పగించి ఒక్కొక్కరికీ రెండు, మూడు మండలాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమించారు. జిల్లాలో 23 మండలాలకు 12 మంది మాత్రమే ఇన్‌చార్జ్ ఎంఈఓలుగా బాధ్యతలు చేపడుతున్నారు. ఇటు తన పాఠశాలను చూసుకోవడంతో పాటు మండలంలోని పాఠశాలలను పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. దీంతో జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడడం లేదని తెలుస్తోంది.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి



“జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా సర్దుబాటు చేశాం. అలాగే ప్రధానోపాధ్యాయులపై భారం తగ్గించడం కోసం సెక్టోరియల్ అధికారులను నియమించాం. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేస్తున్నాం.

– అశోక్, డీఈఓ, సూర్యాపేట

క్లుప్తంగా

గుండెపోటుతో మోతె ఎంపీడీఓ మృతి


శంకర్‌రెడ్డి (ఫైల్)

మోతె : మోతె మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి వేమిరెడ్డి శంకర్‌రెడ్డి(61) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. 2017లో మోతె మండలంలో ఎంపీడీఓగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎంపీపీ ముప్పాని ఆశ, జెడ్పీటీసీ పుల్లారావు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, స్నేహితులు ఎంపీడీఓ స్వగ్రామమైన ఖమ్మం జిల్లా మధిర మండలంలో సిరిపురం గ్రామానికి ఆదివారం చేరుకొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అర్వపల్లి: అర్వపల్లి శివారులో యోగాషిర్డీ సాయిబాబా దేవాలయం సమీపాన ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జాజిరెడ్డిగూడేనికి చెందిన నిమ్మల సైదులు బైక్‌పై జనగామ వైపు నుంచి అర్వపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న సాయిబాబా బైక్ ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. సైదులు పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు.

మొబైల్ అప్పగింత

నడిగూడెం : మండల పరిధిలోని బృందావనపురం గ్రామానికి చెందిన బొడ్డు గోవర్ధన్ ఆదివారం కోదాడ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎకలాస్‌ఖాన్‌పేట సమీపాన రూ.20 వేల విలువైన మొబైల్ దొరికింది. దీంతో బృందావనపురం చేరుకున్న తర్వాత ఆ మొబైల్‌లో ఉన్న ఫోన్ నంబరు ఆధారంగా ఎకలాస్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన వ్యక్తికి బృందావనపురం గ్రామ సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య సమక్షంలో అందచేశారు. దీంతో దొరికిన మొబైల్‌ను నిజాయితీగా సంబంధిత వ్యక్తికి అందచేయడంతో గోవర్ధన్‌ను గ్రామ సర్పంచ్ బెల్లంకొండ హనుమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంభంపాటి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుర్రంపోడు : గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని పాశంవారిగూడెం గ్రామంలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మక్కపల్లి గ్రామానికి చెందిన అందుగుల వెంకటయ్య(51) శనివారం ఉదయం బైక్‌పై దేవరకొండ మండలం పద్మటపల్లి గ్రామానికి బంధువుల ఇంట్లో దశదిన కర్మకు వెళ్లాడు. రాత్రి పది గంటల సమయంలో స్వగ్రామానికి వస్తుండగా పాశంవారిగూడెం గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందాడు. కాగా మృతుడి కుమారుడు శ్రీకాంత్ తన తండ్రి మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

గోవర్ధనగిరిధారిగా నృసింహుడు

- వైభవోపేతంగా యాదాద్రీశుడి బ్రహ్మోత్సవాలు
- నేడు ఎదుర్కోలు ఉత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న ఆచార్యులు


ఆలయ తిరుమాఢ వీధిలో గోవర్ధనగిరిధారి అలంకార సేవలో ఊరేగుతున్న నారసింహుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. స్వామివారి కల్యాణ ఘడియలు సమీపిస్తున్న వేళ అలంకార, వాహన సేవలను ఆలయ ఆచార్యులు అత్యంత పవిత్రంగా నిర్వహిస్తున్నారు. సోమ, మంగళ, బుధవారాలు నిర్వహించే ప్రధానామైన ఘట్టాలకు ఆచార్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఆలయంలో ఆదివారం ప్రభాత వేళ శ్రీవైష్ణవ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రభాతభేరీని నిర్వహించారు.

లోకములను రక్షించే దేవుడిగా..

ఉదయం స్వామివారిని లోకములను రక్షించే దేవుడిగా.. గోవర్ధన పర్వతాన్ని ఎత్తుకొని గోవర్ధనగిరిధారి అలంకార సేవలో ప్రధానాలయం తిరు మాఢ వీధుల్లో ఊరేగారు. అనంతరం స్వామివారి అలంకార సేవను పడమటి రాజగోపురం ముందు గల మండపం వద్ద వేంచేపు చేసి పారాయణికులు, ఆచార్యులు, రుత్వికులు పారాయణాలు, వేద మంత్రాలను పఠించారు. ఇక సన్నాయి, మేళతాళాలతో భాజభజంత్రీ విద్వాంసులు రాగాలపాన చేయగా.. భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఈ వేడుకల్లో వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, పారాణికులు, రుత్వికులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వేంచేపు మండపంలో సింహ వాహన సేవను అధిష్టించి పారాయణం చేస్తున్న ఆచార్యులు

సాయంత్రం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సాయంత్రం ఆలయంలో ఆచార్యులు, రుత్వికులు, పారాయణికులు ప్రబంధ పారాయణం, మూలమంత్ర జపములు, నిత్యారాధనలు కొనసాగించారు. అనంతరం స్వామి వారిని సింహ వాహనంపై ఊరేగించారు. ఉగ్ర నారసింహుడు సింహ వాహనంపై మాఢ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు గొలిపారు. అనంతరం వేంచేపు మండపంలో అధిష్టింపజేసి పారాయణికులు పారాయణం పఠించారు. ఆచార్యులు, రుత్వికులు వేద మంత్రాలను గావించారు. ఉత్సవాల్లో పాల్గొన్న అధికారులకు, భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారిని జగన్మోహిని అలంకార సేవలో ఊరేగిస్తారు. కల్యాణ నారసింహుడిగా తీర్చిదిద్దే పర్వంలో రాత్రి స్వామివారు అశ్వవాహన సేవ ఆలయ మాఢ వీధుల్లో ఊరేగుతూ ఎదుర్కోలు ఉత్సవానికి వచ్చే ఘట్టాలను జరపనున్నారు.


అలంకార సేవకు ముందు ఈఓ, ఆలయాధికారులు

తూర్పు మాఢ వీధి సిద్ధం

స్వామివారి ఎదుర్కోలు ఉత్సవానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తూర్పు మాఢ వీధిలో శ్రీస్వామి అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం సోమవారం సాయంత్రం నిర్వహించేందుకు ప్రత్యేక వేదికలను ఏర్పాట్లు చేస్తున్నారు. ఎదుర్కోలు కార్యక్రమానికి స్థానిక ప్రజలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తారని అధికారులు భావిస్తున్నారు. దీంతో వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, ఉత్సవం సజావుగా జరిగే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలతో పాటు ఆదివారం శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు, ఆచార్యులు, ఆలయాధికారులకు, సిబ్బందికి హైదరాబాద్‌కు చెందిన ఎస్వీ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లను ఆలయ ఏఈఓ గజివెల్లి రఘు, డిప్యూటీ ఈఈ మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. క్యూ కాంప్లెక్స్, బస్టాండ్, ఆలయ పరిసరాల్లో భక్తులకు అందించారు. మండుటెండలకు ఈ మజ్జిగ ప్యాకెట్లు భక్తులకు ఎంతో అవసరం అని భావించి అందించామన్నారు.


కొండపైన ఆచార్యులకు మజ్జిగ ప్యాకెట్లు ఇస్తున్న ఏఈఓ రఘు

ఉచిత వైద్య శిబిరం

స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు హైదరాబాద్‌లోని శ్రీకర ఆస్పత్రి ఆధ్వర్యంలో కొండపై బస్టాండ్‌లో ఉచిత వైద్య సేవలను అందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని ఆయా చికిత్సలు ఉచితంగా చేసుకున్నారు. భక్తులు చేసుకున్న వైద్య పరీక్షలకు సంబంధించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఇక యాదగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు వంశీకృష్ణ, హరీష్ ఆధ్వర్యంలో కొండపైన బస్టాండ్ వద్ద, కొండ కల్యాణ కట్ట వద్ద ఉచిత వైద్య శిబిరం కొనసాగుతుంది.

సినీ నటుల సందడి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని సినీనటుడు, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, బుల్లితెర నటిమణి శివపార్వతి వేర్వేరుగా ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలో స్వయంభూ లక్ష్మీనారసింహులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మండపంలో అష్టోత్తర, సువర్ణ పుష్పార్చన పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వీరికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.


ఆలయంలో సినీ నటుడు, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి

యాదాద్రిలో ప్రారంభమైన ధార్మిక సభలు


శివాలయం సమీపంలో ధార్మిక, సంగీత మహాసభలను ప్రారంభిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని కొండపై గల శివాలయం సమీపంలో ఆలయం ఆధ్వర్యంలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలను ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఇప్పటికే ప్రధానాలయ ప్రాంగాణంలో వైటీడీఏ ఆధ్వర్యంలో ఇంటర్‌నేషనల్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శివాలయం ఆవరణలో ప్రారంభించిన ధార్మిక, సాహిత్య, సంగీత వేడుకల్లో ఉదయం 6 గంటల నుంచి 6.45గంటల వరకు మల్లాపురానికి చెందిన శ్రీరామభక్త భజన మండలి, కార్వాన్‌కు చెందిన శ్రీవిశ్వాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో భజన నిర్వహించారు. అనంతరం 8.45 నుంచి 9.15గంటల వరకు ఆస్థానం వారిచే మంగళ వాయిద్యము, 9.15గంటల నుంచి 9.45వరకు వైదిక ప్రార్థనలు చేపట్టారు. ఆ తరువాత శ్రీఅమరవాది వెంకట నరసింహాచార్యస్వామిచే 9.45 నుంచి 11గంటల వరకు నృసింహ అవతార వైభవం ప్రవచించారు. 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు భక్తప్రహ్లాద హరికథను శారాదా భాగవతారిని గానం చేశారు. సాయంత్రం 4 నుంచి 4.45గంటల వరకు ముడుంబై మహతి బృందంచే నృత్యం, ఉషా గోటేటి బృందంచే 4.45 నుంచి 5.30గంటల వరకు కూచిపూడి, పిల్లుట్ల కనకస్వామి బృందంచే రాత్రి 9గంటలకు చిందు యక్ష గానం నిర్వహించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

ఇక వైటీడీఏ సౌజన్యంతో ప్రధానాలయం ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. సాయంత్రం సమయంలో డాక్టర్ ఆనందశంకర్ జయంత బృందంచే భరత నాట్య ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మంగళభట్ బృందంచే కథక్ నృత్య ప్రదర్శన ప్రదర్శించారు. ఇక మల్లాది బ్రదర్స్ వారిచే కర్నాటక గాత్ర కచేరి భక్తులను ఆకట్టుకుంది.


నాట్యం చేస్తున్న కళాకారులు

స్వామివారిని దర్శించుకున్న దిల్‌రాజు


దిల్‌రాజుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న అధికారి రాజు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని సినీ నిర్మాత దిల్‌రాజు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ మండపంలోని ఉత్సవ మూర్తుల చెంత అష్టోత్తరం, సువర్ణ పుష్పార్చన పూజలో పాల్గొన్నారు. దిల్‌రాజు, కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ప్రొటోకాల్ అధికారి రాజు లడ్డూ ప్రసాదం అందించారు.

బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు నిరాశే

- బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి


మాట్లాడుతున్న కంకణాల శ్రీధర్‌రెడ్డి

చౌటుప్పల్ : రాష్ట్రం వస్తే తమ బతుకులు బాగుపడుతాయని ఆశించిన అన్ని వర్గాల ప్రజలకు బీఆర్ఎస్ పాలనలో నిరాశే మిగిలిందని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో శనివారం రాత్రి ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందన్నారు. వేలాది మంది ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబమే బాగుపడిందని తెలిపారు. బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోలోజు శ్రీధర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రమనగోని శంకర్, నాయకులు ఊడుగు వెంకటేశం, దాసోజు భిక్షమాచారి, గోశిక పురుషోత్తం, వనం దనుంజయ, గోశిక బావనాఋషి, గోశిక ధనుంజయ, పోలోజు భాస్కర్‌చారి, గోశిక నీరజ, ఉప్పు ఆంజనేయులు, బత్తుల యశ్వంత్, నోముల రఘునాథ్, గోశిక వినయ్, రామకృష్ణ, ప్రభాకర్, నరహరి ఉన్నారు.

నారసింహుడి ఆలయంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నిత్య పూజలు సంప్రదాయంగా జరిగాయి. వేకువజామునే ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపట్టారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం గావించి బిందే తీర్థం, ఆరాధన నిర్వహించి, సహస్ర నామార్చన విశేషంగా చేపట్టి, తులసీ దళాలతో అర్చించారు. ముఖ మండపంలో ఉత్సవ మూర్తుల చెంత సువర్ణ పుష్పార్చన, ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు.


ఉత్సవ మూర్తులకు హారతినిస్తున్న ఆచార్యులు

యాదాద్రీశుడి కల్యాణానికి ఏర్పాట్లు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 28వ తేదీన జరిగే శ్రీస్వామి, అమ్మవార్ల తిరు కల్యాణానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ప్రధానాలయ తూర్పు రాజగోపురం సమీపంలోని బ్రహ్మోత్సవ మండపంలో కల్యాణం నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. భక్తులు కల్యాణాన్ని తిలకించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. బ్రహ్మోత్సవ మండపం ముందు, ఇరుపక్కలా ఆచార్యులు, రుత్వికులు, వేద పండితులు, పారాయణీకులతో పాటు వీఐపీలు, ఆలయ ధికారులు, భక్తులు, విలేకరులు కూర్చోవడానికి వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇబ్బందులు తలెత్తకుండా బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కల్యాణోత్సవ ఏర్పాట్లను కలెక్టర్, డీసీపీ పరిశీలించారు. పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత


మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

భువనగిరిటౌన్ : ఇంటి నుంచి వెళ్లొచ్చి భిక్షాటన చేసుకుంటున్న వృద్ధురాలిని సఖి కేంద్రం నిర్వాహకులు ఆదివారం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సఖి కేంద్రం నిర్వాహకులు శ్రీదేవి, లావణ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ముషిరాబాద్‌కు చెందిన సబిత (84) కుటుంబ తగాదాల కారణంగా ఇటీవల ఇంటి నుంచి వెళ్లొచ్చింది. ఆమె కొద్దిరోజులుగా భువనగిరికి వచ్చి భిక్షాటన చేసుకుంటోంది. ఈ నెల 23న రాత్రి సమయంలో భువనగిరిలోని ప్రిన్స్ కార్నల్ వద్ద భిక్షాటన చేసుకుంటూ కలెక్టర్ పమేలా సత్పతికి కనిపించింది. ఆమె ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో సంబంధిత అధికారులు సఖీ కేంద్రానికి తీసుకువచ్చారు. ఆమె నుంచి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ మేరకు 9న ముషిరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆమె భర్త బాలరాజు ఫిర్యాదు చేశారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ సైదులు ఉన్నారు.

బంగారు ఆభరణం పోగొట్టుకున్న వ్యాపారి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పాతగుట్ట చౌరస్తాలో ఉన్న తెలంగాణ టీ స్టాల్ నిర్వాహకులు చాయ్ పార్సల్ చేసే క్రమంలో బంగారు ఆభరణాన్ని పోగొట్టుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లికి చెందిన నరేష్ తెలంగాణ టీ స్టాల్ నడిపిస్తున్నారు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి వచ్చి చాయ్ పార్శల్ చేయాలని కోరాడు. దీంతో నరేష్ చాయ్ పార్శల్‌కు బదులు ఆరు తులాల బంగారు ఆభరణం గల బాక్స్‌ని ఇచ్చాడు. అదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి దానిని తీసుకొని వెళ్లాడు. కొద్ది సమయం తరువాత బంగారు ఆభరణాన్ని పరిశీలించగా అది కనిపించకపోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ఆలేరురూరల్ : అనుమానాస్పద స్థితిలో ఓ మహిళ మృతిచెందింది. ఆలేరులో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని క్రాంతినగర్‌లో నివాసం ఉంటున్న దేవిని ముత్యాలమ్మ(52) యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూర్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. మూడు రోజులుగా ముత్యాలమ్మ ఇంటినుంచి బయటకు రాలేదు. ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో అనుమానంతో చుట్టుపక్కల వారు పోలీసులుకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి తలుపుల పగులగొట్టి చూడగా ముత్యాలమ్మ మృతదేహం కుళ్లిపోయి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముత్యాలమ్మ ఇటీవల రెండెకరాల భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. మృతురాలి బంధువు నగేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇద్రీస్‌అలీ చెప్పారు.

రానున్నది బహుజనుల రాజ్యం


టేకులసోమారంలో మాట్లాడుతున్న విశారదన్ మహారాజ్

వలిగొండ : రాష్ట్రంలో రానున్నది బహుజనుల రాజ్యమేనని, అందు కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా కృషి చేయాలని దళిత శక్తి ప్రోగ్రామ్ అధినేత విశారదన్ మహారాజ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా చేపట్టిన పాదయాత్ర ఆదివారం వలిగొండ మండలంలోని రెడ్లరేపాక, పహిల్వాన్‌పురం, టేకులసోమారం గ్రామాల్లో కొనసాగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంలోని అగ్రకుల నాయకుల దోపిడీని అరికట్టడానికి ఈ పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మణ్, నరేందర్,రాకేష్,శివ, శ్రీకాంత్, ప్రవీణ్, పరుశురాం, కృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


గరిడేపల్లి : గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు


హుజూర్‌నగర్‌లో నాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు జెడ్పీ పాఠశాలలో 1973-74సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న పూర్వవిద్యార్థులు కుటంబ సమేతంగా తరలివచ్చి ఆదివారం మండల కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ జోగు సరోజనీపిచ్చిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం నాటి గురువులు పి.రంగారావు, అలుగుబెల్లి కృష్ణారెడ్డి, స్థానిక సర్పంచ్ జోగి సరోజనిలచ్చిరెడ్డిలను పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించారు. ముందుగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొలిశెట్టి సత్యం, బి.నాగయ్య, ఎస్కె ఖాదర్‌పాష, బండా లింగారెడ్డి, గట్టికొప్పుల నారాయణరెడ్డి, మేకల వీరయ్య, కటికం గోపయ్య, బండ వెంకట్‌రెడ్డి, అరుణ, పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. స్థానిక హైస్కూల్‌లో 1973లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు 50ఏళ్ల తర్వాత అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అలనాడు పాఠాలు బోధించిన గురువులు రంగారావు, భరతారావును శాలువా పూలమాలతో సన్మానించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 5గురు స్నేహితులకు రూ.5వేల చొప్పన ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో విద్యార్థులు కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు.